## కలెక్టర్ రక్తదానం అందరికీ స్ఫూర్తిదాయకం...



**మచిలీపట్నం విజయవాడ , ఏప్రిల్10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లాలోని పౌరులందరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. జాతీయ సర్వే దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం నగరంలోని కలెక్టర్ వారి కార్యాలయ ప్రాంగణంలో సర్వే భూ రికార్డుల సర్వే కార్యాలయ ముంగిట జిల్లా కలెక్టర్ డి కె బాలాజీ సంయుక్త కలెక్టర్ ఎం నవీన్ తో కలసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు రక్తదానం చేసి అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు. పలువురు సర్వే సిబ్బంది కూడా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జాతీయ సర్వే దినోత్సవం పురస్కరించుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేసుకుని సర్వేయర్లందరూ రక్తదానంలో పాల్గొనడం గొప్ప విషయం అన్నారు. రక్తదానం చేయడం చాలా ముఖ్యమైన మంచి కార్యక్రమమన్నారు. ఆసుపత్రులలో పరిశీలిస్తే ప్రతిరోజు ఏదో రకమైన ప్రమాదాలతో వచ్చే రోగులకు గాని , వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో రక్తహీనత ఉండే రోగులకు గాని రక్తం చాలా అవసరం ఉంటుందన్నారు. సర్వే శాఖ వారు ఇటువంటి రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

జిల్లాలోని పౌరులందరూ రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చి ఆపదలో ఉన్న వారిని కాపాడాలన్నారు. ఇతరత్రా ఖాళీగా ఉన్న సమయాల్లో కూడా నగరంలోని ఐ ఆర్ సి ఎస్ వద్ద వీలైనంత ఎక్కువగా రక్తదానం చేయాలని చాలామంది ప్రాణాల్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వే రికార్డుల శాఖ ఏడి లక్ష్మణరావు గుడివాడ ఆర్డిఓ జి బాలసుబ్రమణ్యం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ సిరివి శెట్టి భాస్కర్, డాక్టర్ డి హనుమంతయ్య, కోశాధికారి కుమార్, జిల్లా సమన్వయకర్త హరికృష్ణ, పలువురు సర్వేయర్లు, సర్వే శాఖ సిబ్బంది, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ ట్రైనింగ్ వేసవి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం.

### కృష్ణాజిల్లా డిఇఓ యువి సుబ్బారావు.

**మచిలీపట్నం ఏప్రిల్10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** టీచర్ టెక్నికల్ సర్టిఫికెట్ 42 రోజుల వేసవి శిక్షణ కోర్సును మే ఒకటి నుండి జూన్ 11 వరకు నిర్వహించనున్నట్టు కృష్ణాజిల్లా డీఈవో యువ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. శిక్షణా కేంద్రాలు విశాఖపట్నం కాకినాడ గుంటూరు, కడప అనంతపురంలలో ఉంటాయన్నారు. ఈ కోర్సులలో ప్రవేశాలు పొందదలిచిన అభ్యర్థులు మే ఒకటవ తేదీ నాటికి కనీసం 18 సంవత్సరాల నుండి గరిష్టంగా 45 ఏళ్లు మించకుండా ఉండాలన్నారు. ఎస్ఎస్ సి లేదా సమానమైన పరీక్ష ఉత్తీర్ణతతో పాటు సంబంధిత విభాగంలో లోయర్ గ్రేడ్ టెక్నికల్ సర్టిఫికెట్, ఇంటర్మీడియట్ వృత్తివిద్య కోర్సు ఉత్తీర్ణత, ఎస్ బి టి ఈ టి గుర్తించిన కోర్సులు ఐటిఐ ల ద్వారా పొందిన నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ హ్యాండ్లూమ్ వీవింగ్ వంటి జాతీయ సంస్థల సర్టిఫికెట్లు లేదా పరిశ్రమల శాఖ జారీ చేసిన సర్టిఫికెట్లు ఉండాలని తెలిపారు. అదేవిధంగా తెలుగు విశ్వవిద్యాలయం లేదా సమాన సంస్థల నుండి కర్ణాటక సంగీతం గానం వాయిద్యం లలో డిప్లమా లేదా ఏదైనా విశ్వవిద్యాలయం నుండి ఫైన్ ఆర్ట్స్ లో బ్యాచిలర్స్ డిగ్రీ కలిగిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర రాష్ట్రాల అభ్యర్థులు తమ విద్యా సాంకేతిక అర్హతలను ఆంధ్రప్రదేశ్ వెలుపల బోర్డులు లేదా సంస్థలలో పొందినట్లయితే ప్రవేశానికి ముందు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల నుంచి అనుమతి పొందాలని సూచించారు. ఈ కోర్సుకు దరఖాస్తులు ఏప్రిల్ 26 వరకు స్వీకరిస్తామని తెలిపారు మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్సైట్ ఙఙఙ.ఖజూ.స్త్రీజ.అఅ ను సందర్శించాలన్నారు.

## ఈనెల 14 నుండి చేపల వేట నిషేధం

**మచిలీపట్నం ఏప్రిల్10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సముద్ర జలాల్లో ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి నుండి ప్రభుత్వం చేపల వేటని నిషేధించింది. మెకానిజెడ్ మోటార్ బోట్లలో మత్స్యకారుల చేపల వేట పై నిషేధం అమలులో ఉంటుంది. ఏపీ మత్స్య క్రమబద్ధీకరణ చట్టం ప్రకారం జూన్ 14 వరకు అనగా 61 రోజులు ఈ నిషేధం అమల్లో ఉంటుందని ప్రభుత్వ అధికారులు తెలిపారు. ఈ కాలంలో మత్స్యకారులు సముద్రంలో చేపలు రొయ్యలు వేటాలను పూర్తిగా నిలిపివేయాలన్నారు. ఇంజన్ లేని సాంప్రదాయపడవలకి మాత్రం ఈ నిషేధం వర్తించదన్నారు. చాపలు రొయ్యల సంతానోత్పత్తి సమయం కాబట్టి తల్లి జాతిని సంరక్షించడమే ప్రధాన లక్ష్యంగా చేపల జనాభా పెరుగుదలను ప్రోత్సహించడం అనే సత్సంకల్పంతో సముద్రపు మత్స్య సంపద సుస్థిరత సాధించడం కోసం ప్రత్యేక వేటనిషేధం అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కాలంలో చేపల వేట చేయకుండా మత్స్యకారులు మత్స్య సంపద అభివృద్ధికి సహకరించాలని చట్టాన్ని అతిక్రమించి చేపల వేట సాగిస్తే శిక్షార్హులవుతారని అధికారులు తెలిపారు.

## జనగణనశిక్షణా కార్యక్రమం



**కావలి ఏప్రిల్10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా కావలి ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఎన్యూమరేటర్లకు మూడు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మాస్టర్ రిసోర్స్ పర్సన్ మధుసూదన్ పాల్గొని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరుగుతూ 34 అంశాలతో కూడిన ప్రశ్నావళిని పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. కుటుంబ స్వభావంతో పాటు గృహాల రకాల వివరాలనూ నమోదు చేయాలన్నారు. శనివారం ఉదయం నుంచి శాంపిల్ సర్వే జరుగుతుందని వివరించారు. సర్వేల్లో ఏమైనా తప్పులుండి అధికారుల ఆకస్మిక తనిఖీల్లో పట్టుబడితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పూర్తి అవగాహనతో తప్పులు లేకుండా సర్వే పూర్తి చేయాలని సూచించారు.

## ఫ్రూట్స్ వ్యాపారి పై హత్యాయత్నం



**మచిలీపట్నం, ఏప్రిల్10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం చలరాస్తా సెంటర్లో దారుణం చోటు చేసుకుంది. ఫ్రూట్స్ వ్యాపారిపై స్నేహితుడు కత్తితో దాడి చేసి అమానుషంగా ప్రవర్తించడం స్థానికంగా సంచలన సృష్టించింది. సేకరించిన సమాచారం ప్రకారం చల్లపల్లి పవన్ బాబు, వక్కలగడ్డ సాయి అనే ఇరువురు స్నేహితులు. ఈ ఇద్దరి మధ్య పాత గొడవలు నేపథ్యంలో శుక్రవారం చలరాస్తా సెంటర్ వద్ద చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణ హత్యాయత్నానికి దారితీసింది. సాయి అనే యువకుడు విజయవాడ నుంచి పూటుగా మద్యం సేవించి తనతో తెచ్చుకున్న కత్తితో పవన్ బాబు పై దాడి చేశాడు అని స్థానికులు తెలిపారు. ఈ దాడిలో ముఖం నుండి పొట్ట వరకు కత్తి చీరుకొని బాబు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన బాబును స్నేహితులు హుటాహుటిన మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు పరిస్థితి విషమించడంతో విజయవాడకు రిఫరల్ చేశారు. ఘటనలో అడ్డొచ్చిన మరికొంత మందిపై కూడా సాయి కర్రతో దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, ఇరువురి మధ్య ఘర్షణ లో నిందితుడు సాయి చేతికి కూడా గాయాలయ్యాయి. చికిత్స పొందుతున్న సాయి మాత్రం ముందుగా తనపై బాబు దాడి కి పాల్పడ్డారని ఆరోపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. నిందితుడను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఇనకుదురు పేట పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తర్లువాడలో కొనసాగుతోన్న రైతుల ఆందోళన



**ఆనందపురం ఏప్రిల్10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విశాఖ జిల్లా ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో గూగుల్ డేటా సెంటర్‌కు కేటాయించిన భూముల్లో పరిహారం కింద ఇస్తామన్న మూడు సెంట్లు భూమికి సంబంధించి స్పష్టమైన ప్రకటన చేయలేదని పేర్కొంటూ భూములు కోల్పోయిన రైతుల ఆందోళన కొనసాగుతోంది. గురువారం సాయంత్రం ఆనందపురం తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ వాసు నాయుడు రైతులతో మాట్లాడినప్పటికీ పరిస్థితి అలాగే ఉంది. రెండు రోజుల క్రితం అక్కడ పర్యటించిన జిల్లా కలెక్టర్.. పరిహారం రాదని అనటంతో రైతులు ఆందోళనకు దిగారు. జిల్లా ఉన్నతాధికారి స్వయంగా అలా చెప్పడంతో ప్రభుత్వం ప్రకటించిన మూడు సెంట్ల భూమికి సంబంధించి 621 మంది రైతులకు స్పష్టమైన హామీ ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. స్పష్టమైన ప్రకటన వచ్చేవరకు గూగుల్ డేటాసెంటర్‌కు సంబంధించి ఎలాంటి అభివృద్ధి పనులను జరగనివ్వబోమని రైతులు తేల్చి చెప్పారు. ప్రస్తుతం పోలీసుల బందోబస్తు మధ్య ఆందోళన జరుగుతోంది.

## రెండేళ్లలో 25 శాతం పెరిగిన నూకాలమ్మ ఆలయ ఆదాయం: కమిషనర్



**అనకాపల్లి ఏప్రిల్10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గత రెండేళ్ల నుంచి అనకాపల్లి నూకాలమ్మ ఆలయం ఆదాయం 25 శాతం పెరిగిందని దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ రామచంద్ర మోహన్ అన్నారు. అనకాపల్లి నూకాలమ్మను శుక్రవారం ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కృషితో నూకాలమ్మ కొత్త అమావాస్య జాతర రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. దీంతో ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహాయ సహకారాలు అందుతున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనాలు కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు కమిషనర్ వెల్లడించారు.

## ఒంటిపూట బడులను నిర్వహించకపోతే కఠిన చర్యలు. తణుకు డివైఈవో



**తణుకు ఏప్రిల్10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో తణుకు పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలు తప్పనిసరిగా ఒంటిపూట బడులను నిర్వహించాలని డీవైఈవో మురళి సత్యనారాయణ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి కొన్ని పాఠశాలలు పూర్తి సమయం తరగతులు నిర్వహిస్తున్నాయని, దీనివల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. ఒంటిపూట బడి విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## కృష్ణా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**మచిలీపట్నం, ఏప్రిల్10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కృష్ణా యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జ్యోతిరావ్ పూలే 199 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వర్సిటీ ఉపకులపతి ఆచార్య కే రాంజీ మాట్లాడుతూ 19వ శతాబ్ద ప్రథమార్ధంలోనే నాటి బ్రిటిష్ పాలనలో అట్టడుగు వర్గాల కోసం పోరాడిన ఘనత నాటి సామాజిక తత్వవేత్త, సంఘసంస్కర్త అయిన మహాత్మ జ్యోతిరావు పూలేదని ఆయన కొనియాడారు.. భారతావనికి అత్యద్భుత రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ కూడా ఈయన్ని గురువుగా భావించేవారని, ముఖ్యంగా నాటి ఆడపిల్లలకి విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి, తన సతీమణి సావిత్రిబాయి పూలే సహకారంతో భారతదేశంలోనే మొట్టమొదటిసారి బాలికల కోసం ప్రత్యేకంగా ఒక పాఠశాలలను ఏర్పాటు చేసి వాళ్లను విద్యావంతులను చేయడానికి కంకణం కట్టుకున్నారని చెప్పారు. తదుపరి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుందర కృష్ణ మాట్లాడుతూ నాటి కాలంలో భారతదేశంలో కులవివక్ష బహుళంగా ఉండేదని, దాన్ని రూపుమాపడానికి ముందుకొచ్చిన నాటితరం వారిలో ఈయన అత్యంత ప్రముఖుడన్నారు... ఇంకా ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. పి గోపి,ఆర్ దుర్గాప్రసాద్, కె కవిత, రంగశ్రీ ఇతర బోధనా సిబ్బంది పాల్గొన్నారు...

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన బిజెపి నాయకులు



**మచిలీపట్నం, ఏప్రిల్10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం పెద్దకరగ్రహారము, క్యాంబిల్ పేట గ్రామంలో విబిజి రాంజీ స్కీం ఉపాధి హామి పథకం పనులను పరిశీలించిన బిజెపి నాయకులు మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వి బి జి రాంజీ వికసిత్భారత్ పనికి ఉపాధి కార్యక్రమము మచిలీపట్నం మండలం కరగ్రహారం పంచాయతీ క్యాంబిల్ పేట గ్రామంలో వందరోజులపనిని 125 రోజులకు పెంచిన సందర్భంగా ఏప్రిల్ ఒకటి నుంచి చట్టబద్ధత చేస్తున్నటువంటి ఈ పథకం ఉపాధి హామీ కార్మికులకు తోడ్పాటుగా గ్రామాల అభివృద్ధి కోసం ఈ పథకం ఉపయోగపడుతుందని అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ విశేషమైనటువంటి ప్రజా సంక్షేమం కోరి ఇస్తున్నటువంటి పథకాలను తెలియడం కోసం అవగాహన కల్పిస్తున్నారు. పనులు పరిశీలన నిర్వహించిన జిల్లా కన్వీనర్ జి వి నగరాయలు, జిల్లా బిజెపి అధ్యక్షులు తాతినేని శ్రీరామ్ ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్ర రావు ముఖ్య పరిశీలకులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కంచర్లపల్లి వెంకట రామారావు, సేలం సుబ్బారావు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ప్రసన్న కుమార్, ఉప్పాల హరి, సలాది రామకృష్ణ , ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు, గురువింద పల్లి విజయబాబు, బండారు సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయం



**ఆళ్లగడ్డ ఏప్రిల్10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆళ్లగడ్డ నియోజకవర్గంలో తెలుగు గంగ కాలువ చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని నీటి సంఘం సభ్యులు తెలిపారు. ఆళ్లగడ్డ మండలంలోని దొరకట్టాల సమీపంలో 28వ బ్లాక్ తెలుగు గంగ కాలువలోని నీటి ప్రవాహాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని తెలుగు గంగ ఆయకట్టు కింద సుమారు 5 వేల ఎకరాల్లో పంటలు వేశారని, సాగునీటి కోసం రైతన్నలు ఎమ్మెల్యేను కోరగా వెంటనే స్పందించి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారని చెప్పారు. జల వనరుల శాఖ మంత్రితో మాట్లాడి తెలుగు గంగ కాలువ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా కృషి చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో తెలుగు గంగ డీఈ రత్నరాజు, ఏఈ మోహన్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ రామచంద్ర రెడ్డి, జయ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి.. !



**అనపర్తి ఏప్రిల్10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి శ్రీ రామారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే సదుద్దేశంతో పీఎం పోషణ్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఏర్పాటు చేశాయన్నారు. కానీ గుత్తేదారు సంస్థలు ప్రభుత్వ లక్ష్యాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు భోజనం పంపించిన పాత్రలు సైతం అపరిశుభ్రంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకంపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టి, పరిశుభ్రమైన వాతావరణంలో ఆరోగ్యకరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించేలా మంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే అన్నారు.

## ఎస్సీ హోదా సాధనకై 'చలో నంద్యాల' సభ



**కడప ఏప్రిల్10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** బేడ బుడగజంగాలకు షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) హోదా కల్పించాలని కోరుతూ ఏప్రిల్ 17న 'చలో నంద్యాల' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం కడప 48వ డివిజన్ బుడగజంగం కాలనీలో పోస్టర్లను ఆవిష్కరించారు. కుల ధృవీకరణ పత్రాలు అందక విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాయకులు వివరించారు. ఈ అన్యాయాన్ని ఎదిరించేందుకు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరగనున్న సభకు ప్రజలందరూ తరలిరావాలని వారు కోరారు.

## ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం పట్టివేత...ఆటోసీజ్



**సాలూరు ఏప్రిల్10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పౌర సరఫరాల అధికారులు ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. సివిల్ సప్లై అధికారి అశోక్, సిబ్బందితో కలిసి సాలూరు మండలం దండిగాం గ్రామం వద్ద తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా వెళ్తున్న ఆటోను ఆపి పరిశీలించగా, ప్రభుత్వ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. సుమారు 1000 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, ఆటోను సీజ్ చేశారు. ఈ బియ్యాన్ని సీదరపు దాలయ్య, మువ్వల నారాయణ ఆటోలో ఒడిశాకు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and
Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com